


# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం




సంపుటి : 3 | సంచిక : 314 | జులై 12 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-

# కక్షతో ఆరుగురిని కిరాతకంగా నరికి చంపిన ఉన్మాది!



## రంగారెడ్డి జిల్లాలో ఘోర దారుణం

పోక్సో కేసు కక్షతో ఒకే రాత్రిలో ఆరుగురి హత్య

- బాధిత కుటుంబంతో పాటు భార్య, ఇద్దరు చిన్నారులను కత్తితో నరికి చంపిన నిందితుడు
- దైవాలగూడలో విషాదం.. భారీగా పోలీసులు, పరారీలో నిందితుడు
- గ్రామంలో విషాద ఛాయలు.. ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలింపు
- కక్ష సాధింపుతో కుటుంబాల్ని చీల్చిన ఉన్మాది.. దారుణంపై తీవ్ర దిగ్భ్రాంతి

**మన దునియా,షాబాద్ దైవాలగూడ:జులై 11**

తనపై పోక్సో కేసు పెట్టారన్న కక్షతో ఒక ఉన్మాది తెగబడ్డాడు. కన్నబిడ్డలు, భార్య అనే విచక్షణ కూడా లేకుండా, కేసు పెట్టిన బాధిత కుటుంబంతో సహా మొత్తం ఆరుగురిని కత్తితో పీకలు కోసి అత్యంత కిరాతకంగా హతమార్చాడు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ గ్రామంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ నరమేధం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

**కేసు పెట్టారనే కక్షతోనే..**

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దైవాలగూడ గ్రామానికి చెందిన రాజ్కుమార్ అనే వ్యక్తి, గతంలో అదే గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను వేధించాడు. దీనిపై బాధిత బాలిక తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజ్కుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో జైలుకు వెళ్లిన నిందితుడు ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. తనపై కేసు పెట్టి జైలుకు పంపారనే కక్షతో బాధిత కుటుంబంపై ప్రతీకారం తీర్చుకోవాలని కుట్ర

(మిగతా 2వ పేజీలో..)

**కక్షతో ఆరుగురు ప్రాణాలు తీశిన క్రూరత్వం.. గ్రామంలో కన్నీటి శోకం!**



## సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్

- రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మహమ్మద్ సార్ధన్
- రాష్ట్రానికి ఎమిరేట్స్ సేవలను పెంచాలని కోరిన రేవంత్
- రాష్ట్రానికి రెండు కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయని చెప్పిన సీఎం

ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్

(మిగతా 2వ పేజీలో..)



## ఎస్.జానకి మృతి పట్ల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

- జానకి తన గాత్రంతో నవరసాలు పలికించారన్న ముఖ్యమంత్రి
- చిత్ర పరిశ్రమకు, సంగీత ప్రియులకు తీరని లోటు అన్న రేవంత్ రెడ్డి
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ప్రకటన



(మిగతా 2వ పేజీలో..)

## రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు: కేటీఆర్

- మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకుండానే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చన్న కేటీఆర్
- 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాఖ్య
- కాళేశ్వరంను బద్నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపణ

తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

(మిగతా 2వ పేజీలో..)



## క్రీడలే వారధి.. భారత్–న్యూజిలాండ్ మధ్య శతాబ్దపు క్రీడా సంబంధాలు: ప్రధాని మోదీ

- క్రీడలు దేశాల మధ్య శక్తిమంతమైన వారధిగా పనిచేస్తాయన్న ప్రధాని మోదీ
- న్యూజిలాండ్‌తో శతాబ్దపు క్రీడా సంబంధాలను గుర్తు చేసుకున్న ప్రధాని
- ఆక్లాండ్‌లో న్యూజిలాండ్ ప్రధానితో కలిసి స్పోర్టింగ్ షోకేస్‌లో పాల్గొన్న మోదీ
- ఆస్ట్రేలియాతోనూ క్రీడా సహకారం కోసం ప్రత్యేక రోడ్‌మ్యాప్ ప్రారంభం
- భారత్‌లో 2030 కామన్వెల్త్ గేమ్స్, ఆస్ట్రేలియాలో 2032 ఒలింపిక్స్ నేపథ్యంలో సహకారం

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్

(మొదటి పేజీ తరువాయి)

సార్థన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ వైమానిక సంస్థ 25వ వార్షికోత్సవాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లో ఈ భేటీ జరిగింది. తెలంగాణలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం జరగబోతోందని... రాష్ట్రానికి ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరింత పెంచాలని ఈ సందర్భంగా సార్థన్ ను రేవంత్ రెడ్డి కోరారు. దీంతో, హైదరాబాద్‌కు ఏ-380 విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఎమిరేట్స్ సంస్థ ఆసక్తి చూపించింది. ఎమిరేట్స్‌కు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అంతేకాకుండా గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పాన్సర్‌షిప్ అందించాలని రేవంత్ రెడ్డి కోరగా, ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు. త్వరలో తెలంగాణలో వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొత్త విమానాశ్రయాలను నిర్మించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విమాన సర్వీసులు పెంచాలని ఎమిరేట్స్ ను రేవంత్ కోరారు.

## ఎస్.జానకి మృతి పట్ల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తీవ్ర విషాదం నెలకొంది. ‘దక్షిణ భారత గాన కోకిల’గా సుపరిచితురాలైన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి శనివారం కర్ణాటకలోని మైసూరులో కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆరు దశాబ్దాలకు పైగా తన మధుర స్వరంతో కోట్లాది మంది సంగీత ప్రియులను అలరించిన జానకమ్మ మరణంతో భారతీయ సంగీత రంగంలో ఒక శకం ముగిసింది.ఎస్. జానకి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన గాత్రంతో నవరసాలను పలికించిన ఆమె, తాను తెలుగు గడ్డపై జన్మించినందుకు ఎల్లప్పుడు గర్వంగా భావిస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఆమె మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు, సంగీత ప్రియులకు తీరని లోటని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.దక్షిణ భారత చలనచిత్ర సంగీత ప్రపంచంలో జానకి గారు తన గళమాధుర్యంతో శ్రోతల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని సీఎం కొనియాడారు. అనేక చిత్రాల్లో పాత్రోచితంగా, సన్నివేశాలకు అనుగుణంగా భావోద్వేగాలను పలికిస్తూ ఆమె పాడిన పాటలు సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశాయని పేర్కొన్నారు.తెలుగు, తమిళం, హిందీ సహా మొత్తం 17 భాషల్లో దాదాపు 50 వేల గీతాలను ఆలపించి, ఎన్నో జాతీయ పురస్కారాలను కైవసం చేసుకున్నారని స్మరించుకున్నారు. జానకి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకతప్త హృదయాలైన వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు: మొజ్తబా ఖమేనీ ప్రకటన

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. టెలిగ్రామ్ ద్వారా విడుదల చేసిన సందేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతికి కారకులైన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మొజ్తబా హెచ్చరించారు. ఇది దేశ ప్రజల డిమాండ్ అని, తన నాయకుడితో పాటు అమరులైన వారి తరఫున హంతకులపై ప్రతీకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా.. జులై 9న జరిగిన తన తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయారు. తనను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో మొజ్తబా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# కక్షతో ఆరుగురిని కిరాతకంగా నరికి చంపిన ఉన్మాది: రంగారెడ్డి జిల్లాలో ఘోర దారుణం

(మొదటి పేజీ తరువాయి)

**అర్ధరాత్రి వేళ నరమేధం..**

శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అందరూ నిద్రిస్తున్న సమయంలో రాజ్కుమార్ పదునైన కత్తితో వీరంగం సృష్టించాడు. మొదట బాధిత బాలిక ఇంటిపై దాడి చేశాడు. నిందితుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన బాలిక నానమ్మ, తల్లిని అక్కడికక్కడే నరికి చంపాడు. అనంతరం ఆ మైనర్ బాలికను బలవంతంగా ఊరి చివర ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లి అక్కడ కిరాతకంగా హతమార్చాడు.అంతటితో ఆ ఉన్మాది రక్తం చల్లారలేదు. నేరుగా తన ఇంటికి చేరుకుని, బెడ్‌పై నిద్రిస్తున్న తన భార్య సరిత (28), ఇద్దరు అమాయక కుమారులు చిన్న పిల్లలు అని కూడా చూడకుండా కత్తితో గొంతులు కోసి దారుణంగా హత్య చేశాడు. ఒకే రాత్రి, ఒకే గ్రామంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో దైవాలగూడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

**రంగంలోకి భారీగా పోలీసులు..**

హత్యలు చేసిన అనంతరం నిందితుడు రాజ్కుమార్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీ యోగేష్ గౌతమ్, సీఐ కాంతారెడ్డి భారీ పోలీసు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్స్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు.మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం చేవెళ్ల, షాద్ నగర్, ఉస్మానియా ఆసుపత్రులకు తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కుటుంబ సభ్యుల కన్నీరు..**

నిందితుడు రాజ్కుమార్, సరిత లది ప్రేమ వివాహమని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని సరిత సోదరుడు, బంధువులు రోదిస్తూ తెలిపారు. “ఇష్టం లేకపోతే మా పిల్లని మా ఇంటికి పంపించాల్సింది కానీ, ఇలా పసిపిల్లలతో సహా ముగ్గురిని చంపేస్తాడా?” అంటూ వారు కన్నీరుమున్నీరయ్యారు. నిందితుడికి చట్ట ప్రకారం కఠినమైన శిక్ష పడాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం నిందితుడు రాజ్కుమార్ పరారీలో ఉన్నాడని, అతనిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు.

# రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు.ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. ‘ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు’ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

# క్రీడలే వారధి.. భారత్-న్యూజిలాండ్ మధ్య శతాబ్దపు క్రీడా సంబంధాలు: ప్రధాని మోదీ

భారత్, న్యూజిలాండ్ మధ్య క్రీడలు ఒక శక్తిమంతమైన వారధిగా పనిచేస్తున్నాయని, ఇరు దేశాల ప్రజలను బలంగా కలుపుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో కలిసి ఆక్లాండ్‌లో జరిగిన ‘స్పోర్టింగ్ షోకేస్’ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పర్యటన ద్వారా మోదీ తన క్రీడా దౌత్యానికి మరింత పదునుపెట్టారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. “భారత్, న్యూజిలాండ్ మధ్య క్రీడలు ఎల్లప్పుడూ బలమైన వారధిగా నిలిచాయి. ఈ ఏడాదితో మన మధ్య క్రీడా సంబంధాలు ఏర్పడి ఒక శతాబ్దం పూర్తవుతోంది. ఆక్లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో కలిసి నేను పాల్గొన్న స్పోర్టింగ్ షోకేస్‌లో అత్యాధునిక క్రీడా ఆవిష్కరణలను చూశాను. టెక్నాలజీ, సృజనాత్మకత క్రీడల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుతున్నాయో, మన రెండు దేశాలను మరింత దగ్గరికి ఎలా చేరుస్తున్నాయో చూడటం అద్భుతంగా ఉంది” అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు .అంతర్జాతీయ స్థాయిలో క్రీడా భాగస్వామ్యాలను బలోపేతం చేయాలనే తన విస్తృత ప్రయత్నాల్లో భాగంగానే ప్రధాని మోదీ ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కొన్ని రోజుల క్రితమే ఆయన ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఇదే తరహాలో క్రీడా సంబంధాలపై దృష్టి సారించారు. మెల్‌బోర్న్‌లోని చారిత్రక క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగిన భారత్-ఆస్ట్రేలియా క్రీడా సంబంధాల వేడుకలో మోదీ పాల్గొన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, విక్టోరియా ప్రీమియర్ జెసింటా అలన్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అక్కడ క్రికెట్, కబడ్డీ, ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ ఆడుతున్న యువ క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియా క్రీడా దిగ్గజాలైన స్టీవ్ వా, లీసా స్థలేకర్ వంటి వారు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ కలిసి ‘భారత్-ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్’ను ప్రారంభించారు. ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో క్రీడలు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలు కీలక స్తంభాలని ఈ రోడ్‌మ్యాప్ నొక్కి చెబుతోంది. భవిష్యత్ దశాబ్దంలో క్రీడా రంగంలో సహకారానికి అపారమైన అవకాశాలున్నాయని మోదీ అన్నారు. భారత్ 2030లో కామన్వెల్త్ క్రీడలకు, ఆస్ట్రేలియా 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో క్రీడలు, సంబంధిత పరిశ్రమలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడానికి ఇది ఒక సహజమైన అవకాశమని ఆయన వివరించారు. ఇదే సమయంలో ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టుకు మోదీ అభినందనలు తెలిపారు. క్రీడా నైపుణ్యం, యువత భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి రంగాల్లో కలిసి పనిచేయడానికి గొప్ప అవకాశాలున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జులై | ఆదివారం | 12 | 2026



# 200 మంది విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

**విద్యతోనే భవిష్యత్తు నిర్మాణమన్న ఏసీపీ కిరణ్ కుమార్.**

**సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన సీఐ రమేష్.**

**మన దునియా, జులై 11, మంచిర్యాల జిల్లా**



విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా అమ్మ ఆదర్శం యూత్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఒర్రెగడ్డ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 200 మందికి పైగా విద్యార్థులకు రూ.30 వేల విలువైన విద్యా కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాదని అన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో విద్యకు మించిన సంపద లేదని పేర్కొన్నారు.అనంతరం మందమర్రి సీఐ పర్సా రమేష్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.అమ్మ ఆదర్శం యూత్ వ్యవస్థాపకులు బండారి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడం, నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప పోలీసు అధికారులు నరేష్, శ్రీధర్, అమ్మ ఆదర్శం యూత్ సభ్యులు సాతిని సంజీవ్, సిద్దర్ల రాహుల్, విరుగురాల వినయ్, గంధం సంతోష్, గాదె మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారతదేశ చరిత్రను తిరగ రాసేది బహన్ మాయావతి

**చీఫ్ జోన్ ఇన్చార్జ్ దాగిల్ల దయానందరావు**

**మన దునియా, జులై 11,మంచిర్యాల జిల్లా**



మంచిర్యాల జిల్లా కేంద్రం లోని చార్వాక ట్రస్ట్ ప్రాంగణం నందు బహుజన్ సమాజ్ పార్టీ ఈసీ సమావేశం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జోన్ -2 చీఫ్ జోనల్ ఇంచార్జ్ దాగిల్ల దయానందరావు విశిష్ట అతిథులుగా పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ కాదాసి రవీందర్, వర్కిల్ల మల్లేష్ హాజరయ్యారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన దాగిళ్ళ దయానందరావు మాట్లాడుతూ భారత దేశ చరిత్రను తిరగ రాసేది బహన్ మాయావతి అన్నారు.రాజ్యాంగ రక్షణ అణగారిన వర్గాల అభివృద్ధి బహుజన్ సమాజ్ పార్టీ లక్ష్యమన్నారు 2027లో యూపీ అధికారాన్ని బహుజన సమాజ్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా 2028లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ మంచిర్యాల జిల్లాలో పార్టీ బలోపేతానికి నిరంతరం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ జెండా ఎగురవేయాలి అన్నారు జిల్లాలో పార్టీ క్రమంగా బలపడుతుందని దానిని మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు చీఫ్ జోన్ ఇన్చార్జ్ దాగిళ్ళ దయానంద రావు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పెట్టం చంద్రశేఖర్ మహనీయుల ఆలోచనలకు ఆకర్షితుడై బహుజన సమాజ్ పార్టీలో చేరడం జరిగింది పెట్టం చంద్రశేఖర్ కు ముఖ్య అతిథి దాగిళ్ళ దయానంద రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి పెట్టం చంద్రశేఖర్ కు మంచిర్యాల నియోజకవర్గం ఇంచార్జి గా ప్రకటించినారు యొక్క కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బోయిన్పల్లి సంతోష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామిళ్ళ మురళి, బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ లు గోమాస బ్రహ్మానందం, గోలేటి నారాయణ, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షులు బండారి రాజ్ కుమార్, చెన్నూరు నియోజకవర్గం అధ్యక్షులు గాజుల శంకర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎండి మాతిన్ ఖాన్, నస్పూర్ మండల అధ్యక్షుడు వేముల కిరణ్, నాయకులు జాగిరి రాజేష్,. తదితరులు పాల్గొన్నారు

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం.. ఆ రైతులకు రూ.లక్షన్నర వరకూ రుణమాఫీ..

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:జులై 11**

రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమరావతి భవిష్యత్ అవసరాల కోసం ఏపీ ప్రభుత్వం రెండో దశ భూసమీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే.అమరావతి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు సహా వివిధ ప్రాజెక్టుల కోసం అదనంగా భూమిని సమీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండో దశ భూసమీకరణ సజావుగా జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా అమరావతి రెండో దశ భూసమీకరణలో భూములు అందిస్తున్న ఏడు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది.ఈ రైతులకు రూ.1.50 లక్షల వరకూ రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకుంది. అమరావతికి భూములు ఇచ్చే రైతులకు రుణమాఫీ చేయాలని ఇటీవల జరిగిన సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయం గురించి శుక్రవారం జరిగిన కేబినెట్ భేటీలోనూ చర్చించి.. రూ.లక్షన్నర వరకూ రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. ఈ విషయాలను మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం ఏపీ కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో అజెండాలోని 30కి పైగా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు మంత్రి పార్థసారథి వెల్లడించారు. రూ.9,355 కోట్లతో గ్రామాలలో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే విశాఖపట్నంలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏర్పాటు, రూ.50 కోట్లతో పర్యాటక రంగం ప్రచారానికి ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. నెల్లూరు, కడప, విజయవాడలోని కొన్ని హోటల్స్‌కు ప్రోత్సాహకాలు అందించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు.అమరావతి రెండో దశ భూసమీకరణలో భూములు అందిస్తున్న ఏడు గ్రామాల వారికి రూ. లక్షన్నర వరకూ రుణమాఫీ చేసేందుకు కేబినెట్ నిర్ణయించిందని.. 2026 జనవరి 6 కంటే ముందు తీసుకున్న అప్పులకే ఇది వర్తిస్తుందని పార్థసారథి వెల్లడించారు. వీటితో కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్కు ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణ, ఐఐటీ జేఈఈ, నీట్‌కు రెసిడెన్షియల్ కోచింగ్, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరులో అంబేడ్కర్ గురుకుల సీవోఈ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.




## ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో నిర్లక్ష్యం.. బాన్సువాడ ఎంపీవోపై సస్పెన్షన్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**




ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో నిర్లక్ష్యం.. బాన్సువాడ ఎంపీవోపై వేటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన బాన్సువాడ ఎంపీవోను అధికారులు సస్పెండ్? చేశారు.

బాన్సువాడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ ఆశిష్? సంగ్వాన్ సీరియస్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో బాన్సువాడ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)పై వేటు వేశారు.

ఇళ్ల నిర్మాణ పురోగతిపై..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని సక్రమంగా పర్యవేక్షించడంలో ఎంపీవో నాగరాజు విఫలమైనట్లు అధికారుల పరిశీలనలో తేలిందని సమాచారం. అలాగే పైఅధికారుల ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు ఎంపీవో నాగరాజును హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

## అయోధ్య రాముడి విరాళాల చోరీపై రంగంలోకి సుప్రీంకోర్టు.. ఈనెల 13న కీలక విచారణ!

**మన దునియా,న్యూఢిల్లీ:జులై 11**



అయోధ్య రామ మందిరం విరాళాల చోరీ మరియు నిధుల దుర్వినియోగంపై దాఖలైన కీలక పిటిషన్లను ఈ నెల 13 (సోమవారం)న సుప్రీంకోర్టు విచారించనుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ విచారణను చేపట్టబోతోంది.సోమవారం ఉదయం న్యాయస్థానం కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే విచారించాల్సిన అత్యవసర కేసుల జాబితాలో (కాజ్ లిస్ట్) ఈ పిటిషన్లను చేర్చారు.కోట్లాది మంది భక్తులు సమర్పించిన విరాళాల రక్షణ మరియు పారదర్శకతకు సంబంధించిన అంశం కావడంతో ఈ విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందిన విరాళాల చోరీకి సంబంధించి, కేవలం స్థానిక పోలీసు దర్యాప్తు మాత్రమే సరిపోదని పిటిషనర్లు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో కేంద్ర దర్యాప్తు సంస్థ చేత నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు.

## తుంగభద్రకు పోటెత్తిన వరద: మరో 4 రోజులు ఇలాగే ఉంటే శ్రీశైలానికి నీళ్లు

**మన దునియా,హైదరాబాద్:జులై 11**




హైదరాబాద్: కర్ణాటక రాష్ట్రం పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్రకు ఆశాజనకంగా వరద మొదలైంది. ఆలస్యంగానైనా వరద చేరికతో తుంగభద్ర డ్యాంలో జలకళ కనిపిస్తుంది.తెలుగు రాష్ట్రాలకు జీవనాడి శ్రీశైలం జలాశయం తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. గత ఏడాది ఈ సమయానికే గేట్లెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తే.. ఈ ఏడాది నీటి చుక్క జాడ లేదు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కి.. శ్రీశైలం గేట్లు ఎత్తే అద్భుత ఘట్టం కోసం తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.రాయలసీమ జిల్లాలకు ప్రాణాధారమైన తుంగభద్ర జలాశయానికి శుక్రవారం (జులై 10) ఉదయనికి 40వేల క్యూసెక్కులు పైగా వరద వచ్చి చేరుతుంది. ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. డ్యాం గరిష్ట నీటి మట్టం 1,633 అడుగులు, ప్రస్తుతం 1596.34 అడుగులుగా ఉంది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.155 టీఎంసీల వరద చేరింది. ఎగువన తుంగ డ్యాంకు వరద పోటెత్తడంతో 22 గేట్లేత్తి 26,500 క్యూసె క్కులు విడుదల చేస్తున్నారు.శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో తుంగభద్ర జలాశయానికి సగటున 44,315 క్యూసెక్కులు వరద చేరుతుందని టీబీపీ బోర్డు అధికారులు తెలిపారు. గత ఏడాది ఈ సమయానికి 1,624.81 అడుగల లెవల్లో 75.934 టీఎంసీలు చేరడమే కాకుండా 52,423 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండడంతో గేట్లు ఎత్తేసి 61.145 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ఈ ఏడాది ఆలస్యంగా వరద ప్రవాహం ప్రారంభమైంది.

కృష్ణమ్మ కోసం ఎదురుచూపులు

తెలుగు రాష్ట్రాల్లో కీలకమైన శ్రీశైలం జలాశయానికి నీటి జాడ కనిపించడం లేదు. గత ఏడాది జూలై 8న సీఎం చంద్రబాబు శ్రీశైలం క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువన నాగార్జున సాగర్?కు నీటిని విడు దల చేశారు. ప్రస్తుతం కనుచూపు మేరలో కూడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. డ్యాం గరిష్ట నీటి మట్టం 885 అడుగుల కాగా, ప్రస్తుతం 821.60 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, 42.0197 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది.

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

# గురువులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదగాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**


జీవన పయనంలో ప్రతి వ్యక్తికి గురువులు ఉంటారని, వారిని ఆదర్శంగా న్యాయవాద వృత్తిలో ఎదగాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు శివ మంగల్ సింగ్, మదన్ లాల్ గుప్తా అన్నారు. గురుపూర్ణిమ వారోత్సవాల సందర్భంగా నిజామాబాద్ జిల్లా న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి కృష్ణానంద్, రాజ్ కుమార్ సుబేధార్ జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రతినిధులు బృందం కలిసి సీనియర్ న్యాయవాదులు శివ మంగళ్ సింగ్, మదన్ లాల్ గుప్తా లను వారివారి నివాసాలలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా తో ఘనంగా సత్కరించిన సమయంలో వారు మాట్లాడారు. నిరంతర అధ్యయనం, లేటెస్ట్ సుప్రీంకోర్టు, హైకోర్టు ల తీర్పులను వంటబట్టీచ్చుకోవాలని పేర్కొన్నారు.న్యాయవాదుల ముందుకు వచ్చే ప్రతికేసు పైల్ ను క్షుణంగా చదివి, డ్రాఫ్టింగ్ చేసుకోవాలని తెలిపారు. పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో గత 60 సంవత్సరాలుగా సీనియర్ న్యాయవాదులు సేవలందించడం అభినందనీయమని , గురువు లేనిదే జ్ఞానం లేదు , మన అజ్ఞానాన్ని పోగొట్టి మంచి మార్గాన్ని చూపించేవారు గురువని, గురుపూర్ణిమ నేపథ్యంలో గురువులను స్మరించుకోవాలనే తలంపుతోనే సీనియర్ న్యాయవాదుల గౌరవించుకోవడం జరుగుతున్నదని తెలిపారు ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి కృష్ణానంద్ సీనియర్ న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, సుదర్శన్ రెడ్డి పిల్లి శ్రీకాంత్, జయప్రకాశ్ లోయ, శరత్ చంద్ర, తదితరు న్యాయవాదులు పాల్గొన్నారు

# అత్యవసర సమయంలో అండగా.. సీఎం సహాయనిధి



**5 లక్షల ఎల్.ఓ.సి లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**



Dr. R. BHOOPATHI REDDY (M.S. Ortho)
Member of Legislative Assembly
18-Nizamabad Rural
Assembly Constituency (Telangana State)

Official Address : Flat No: 303, Block-A, Ashoka Township, Bypass Road, Gopanpally, Nizamabad - 503 002
Correspondence Address : Villa No. 19, Aditya Villa Grande, Petbasheerabad, Suchitra, Hyderabad - 500 067
Camp Office Mobile : 8143893389
Email:rekulapallybhoopathireddy@gmail.com

L.r No: Dr.RBR/MLA /NZB (Rural)/ 226 /2026 Dated: 11-07-2026

To
Sri. Anumula Revanth Reddy garu,
Hon"ble Chief Minister,
Government of Telangana,
Hyderabad.

Most Respected Sir,

This is to submit that, Sri. Nagula Laxman S/o. Nagula Bhoomaiah R/o H.No: 4-79 Ramadugu Village, Dharpally Mandal, Nizamabad District is suffering from LEFT FTP CALVARIAL DEFECT he is admitted in Nims Punjagutta, Hyderabad . He requires a prolonged treatment withLeft Ftp Implant Cranioplasty and its related procedures. The Hospital authorities have given, an estimation of Rs.500000/-( Rupees Five Lakh(s) Only )for the treatment.

The Patient belongs to a very poor family and genuinely BPL. Therefore it is requested to kindly grant the LOC, for the required amount to this Patient and do the needful. The necessary Original and Photostats documents are herewith enclosed for your kind perusal .

Worm regards,

Yours Sincerely
(Dr. R. Bhoopathi Reddy)

Encl:
1 Application in Original.
2 Hospital Estimation.
3 Ration Card / Income Certificate.
4 Aadhar Card

నిరుపేదలకు అత్యవసర సమయంలో కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి పేర్కొన్నారు. ధర్పల్లి మండలం రామడుగు గ్రామానికి చెందిన నాగుల లక్ష్మణ్అనారోగ్య సమస్యలతో.. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్ర చికిత్స నిమిత్తం రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. దీంతో రూ.5 లక్షలకు సంబంధించి ఎల్.ఓ.సి లెటర్ ను బాధితుడికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు.ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో పాటు పలువురు పార్టీ నాయకులు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# దోషులకు శిక్ష పడేలా .. బాధితులకు న్యాయం జరిగేలా

## అండగా ఉంటాం: ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి











- **కువైట్ లో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**
- **కోరట్ పల్లి లో ఎమ్మెల్యే పర్యటన**
- **బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

ఇటీవల కువైట్ దేశంలో హత్యకు గురైన గుగ్లోత్ కైలాస్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండడంతో పాటు నిందితులకు శిక్ష పడేలా చూస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం డిచ్ పల్లి మండలం కొరట్ పల్లి తండా లో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. కొడుకును కోల్పోయిన తల్లితండ్రులు ఎమ్మెల్యే వద్ద కన్నీరుమున్నీరయ్యారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్థానిక పోలీసుల నుండి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరారీలో ఉన్న మరొకరిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాగా తక్షణ సాయంగా రూ. 10 వేలు కుటుంబానికి అందజేశారు.ఈ మేరకు ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించి మాట్లాడుతూ.. ఇటీవల కువైట్ లో కైలాస్ అనే వ్యక్తి మృతి చెందగా.. పక్క గ్రామస్తులే హత్య చేసినట్లుగా ప్రాథమిక నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. కాగా బ్రతుకు దెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లి ఉద్యోగం చేస్తున్న యువకుడు ఇలా అకాల మృతి చెందడం బాధాకరం అన్నారు. ఈ ఘటనలో ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడడంతో పాటు.. ఎన్నారై రాష్ట్ర అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. బాధితులకు ప్రభుత్వం పరంగా అందాల్సిన సహాయం అందిస్తామన్నారు. అదేవిధంగా ఇప్పటికే నిందితుల్లో ఒకరిని కువైట్ లో పోలీసులు అదుపులోకి తీసుకోగా .. మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసిందన్నారు. త్వరలోనే అతన్ని కూడా అదుపులోకి తీసుకొని చట్టప్రకారం వారికి శిక్ష పడేలా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబర్ సింగ్, మునిపల్లి సాయ రెడ్డి, అమృతపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, తారాచంద్ నాయక్, రాంచందర్ గౌడ్, శ్యాంసన్, జహూర్, సర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# SIR ప్రక్రియను పర్యవేక్షించిన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి






**ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి**
**ఈ నెల 20 వరకే డెడ్ లైన్ పెట్టుకోండి**
**ఎక్కడ కూడా అలసత్వం వహించొద్దు**
**దూస్ గాం గ్రామ పంచాయతీలో SIR ప్రక్రియ పరిశీలిన**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

డిచ్ పల్లి మండలం దూస్ గాం గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ూ×=) ప్రక్రియను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పర్యవేక్షించారు. ఈ మేరకు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ప్రక్రియను పరిశీలించారు.స్థానిక ఎమ్మార్వో నుండి పలు వివరాలు అడిగి తెలుసుకొని.. పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరికి ఎన్యూమరేషన్ ఫారం అందించి తిరిగి సేకరించేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు.మండల వ్యాప్తంగా దాదాపు 60 శాతం దూస్ గాం లో సైతం 60-70 శాతం ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో వంద శాతం ప్రక్రియను పూర్తి చేయాలని ఈ నెల 24 వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ 20 లోపే డెడ్లైన్ పెట్టుకుని పూర్తి చేయాలని సూచించారు.అటు స్ సార్ ప్రక్రియలో సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులని అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సహాయంగ సర్పంచ్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.ఓటుహక్కు ప్రవాస్వామ్య దేశంలో అత్యంత విలువైనదని తెలిపిన ఎమ్మెల్యే.. ఏ ఒక్క ఓటు కూడా గల్లంతు కాకుండా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు మెలగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబర్ సింగ్, మునిపల్లి సాయ రెడ్డి, అమృతపూర్ గంగాధర్, భాస్కర్ రెడ్డి, ఉమ్మాజి నరేష్, పొలసాని శ్రీనివాస్, తారాచంద్ నాయక్, రాంచందర్ గౌడ్, ఉమ్మాజి నరేష్, స్థానిక సర్పంచ్ సువర్ణ-వెంకటేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జులై । ఆదివారం । 12 । 2026



# బండి సంజయ్ పుట్టినరోజు వేడుకలు





**మన దునియా కమలాపూర్**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను కమలాపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ, సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన బండి సంజయ్ కుమార్ అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రి స్థాయికి చేరుకోవడం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేస్తున్నారని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న నాయకుడని కొనియాడారు. బండి సంజయ్ కుమార్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవను మరింత కాలం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు. పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యువత సేవాభావంతో ముందుకొస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యం






- **'ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం' 9వ వారంలో ఉత్సాహంగా శుభ్రత కార్యక్రమం**
- **స్వచ్ఛ కమలాపూర్ నిర్మాణానికి ప్రతి యువకుడు బాధ్యత తీసుకోవాలి -- సర్పంచ్ పబ్బు సతీష్**

**మన దునియా -- కమలాపూర్:**

గ్రామాభివృద్ధి అనేది ఒక్క ప్రజాప్రతినిధుల బాధ్యత మాత్రమే కాదని, యువత సేవాభావంతో ముందుకొచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినప్పుడే స్వచ్ఛమైన, ఆదర్శ గ్రామ నిర్మాణం సాధ్యమవుతుందని కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. గ్రామ పంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న "ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం" కార్యక్రమం తొమ్మిదో వారంలో భాగంగా శనివారం 12వ వార్డులో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు మురికి కాలువలను శుభ్రం చేసి గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఇంటి పరిసరాలు, వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ, గ్రామంలోని యువకులు సేవా దృక్పథాన్ని పెంపొందించుకుని స్వచ్ఛందంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో యువత చురుకైన పాత్ర పోషిస్తే గ్రామాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి వారం శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ పంచాయతీ,పాలక మండలి సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, యువకులు,, గ్రామ పెద్దలు పాల్గొని శ్రమదానంలో భాగస్వాములయ్యారు.

# పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి 7 మంది అరెస్ట్

**మన దునియా,భూపాలపల్లి జిల్లా:జులై 11**

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలోని సిసిఎస్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భాగంగా, భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి (ఎస్‌ఎం) గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 07 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి పేకాటలో వినియోగిస్తున్న ?4,850/- నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదుతో పాటు, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ప్రజలను హెచ్చరిస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించాలని కోరడం జరిగింది.






# దళిత బంధు రెండో విడత నిధులు ఎక్కడ..?

**హామీలు ఇచ్చి రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం -- మాట్ల దినేష్**

**మన దునియా -- కమలాపూర్**




దళిత బంధు రెండో విడత నిధుల విడుదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ కమలాపూర్ దళిత నేత మాట్ల దినేష్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే రెండో విడత నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీని అమలు చేయకపోవడం దళితుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రెండో విడత నిధుల కోసం అర్హులైన లబ్ధిదారులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేకపోవడం దురదృష్టకరమన్నారు. దళిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఇటీవల మంత్రి శ్రీధర్ బాబును లబ్ధిదారులు కలిసి సమస్యను వివరించగా, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను సంప్రదించాలని సూచించినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రెండో విడత దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే అర్హులైన లబ్ధిదారులతో కలిసి భారీ స్థాయిలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని మాట్ల దినేష్ హెచ్చరించారు.

## పోలీసులు దాడి... ముగ్గురు అరెస్టు

**జూదంపై బిచ్కుంద పోలీసులు దాడి... ముగ్గురు అరెస్టులి**

**రూ.4,600 నగదు, 3 మొబైల్ ఫోన్లు, 1 బైక్ స్వాధీనం**

**జూదం, బెట్టింగ్‌లపై ఉపేక్ష లేదు : జిల్లా ఎస్పీ**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:**



బిచ్కుంద : విశ్వసనీయ సమాచారం మేరకు బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్కల్ గ్రామంలో ఈరోజు బిచ్కుంద ఎస్ఐ రాజు తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 4,600 నగదు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**జూదం వల్ల కుటుంబాలు నాశనం : ఎస్పీ**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో జూదం, పేకాట, బెట్టింగ్, అక్రమ మద్యం, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "జూదం, బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాలు వ్యక్తుల జీవితాలను నాశనం చేయడమే కాకుండా, కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిని దెబ్బతీసి, సమాజంలో నేరాల పెరుగుదలకు దారితీస్తాయి" అని జిల్లా ఎస్పీ తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల ఆర్థిక నష్టాలతో పాటు కుటుంబ కలహాలు, సామాజిక సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తిజూదానికి బానిసై నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దని, కష్టపడి సంపాదించే సరైన మార్గాన్ని ఎంచుకొని మీ భవిష్యత్తును, మీ కుటుంబ భవిష్యత్తును ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని జిల్లా ఎస్పీ సూచించారు. జూదం, బెట్టింగ్ లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కష్టకాలంలో కాంగ్రెస్ జెండాను మోసిన ధీరుడు పోదెం వీరయ్య వారితో పని చేయడం గర్వకారణం అంటున్న కొంతమంది నాయకులు

**మన దునియా, వాజేడు ,జూలై 11**

భద్రాది కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో ఎదురైన తరుణంలో పార్టీ ఉనికి కోసమే పోరాడాల్సిన పరిస్థితి వచ్చిన రోజు ల్లో ఒక నిజమైన నాయకుడిగా నడిపిన ప్రజా నేత మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్య నాయకత్వంలో పనిచేయడం మాకు దక్కిన గౌరవం గా భావిస్తున్నాము ఒకానొక సమయంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతుందనే ప్రచారం జరిగినప్పుడు చేతిలో కాంగ్రెస్ జెండా పట్టుకుని బయటకు రావడానికి కార్యకర్తలు భయపడి వెనకడుగు వేసిన రోజులను మనం చూశాం పార్టీ వైపు నిలబడటానికి ఎవరు లేని ఆ శూన్య సమయంలో నిరంకుశ శక్తులను ఎదురొడ్డి నేనున్నాను మన వెనుక కాంగ్రెస్ జెండా ఉంది అంటూ గుండెల నిండా ధైర్యాన్ని నింపిన ఏకైక నాయకుడు పోదెం వీరయ్య ప్రలోభాలకు లొంగకుండా బెదిరింపులకు లొంగకుండా కార్యకర్తలకు అండగా నిలబడి జిల్లాలోకాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన ఘనత ఆయనది నాడు ఆయన చేసినా ధైర్యమే నేడు జిల్లాలో పార్టీ పటిష్టంగా ఉండటానికి పునాది వేసింది నాయకుడు అంటే అధికారంలో ఉన్నప్పుడు వేనకుండేవాడు కాదు కష్ట కాలంలో కార్యకర్తల కంటే ముందుండి నడిచేవాడు ఆనాడు ఆయన ఇచ్చిన ధైర్యంతో ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ కోసం ఒక సైనికుడిలా కలిసి పని చేసే అవకాశం లభించడం మా జీవితంలో మరువలేనిదని కార్యకర్తల గుండెల్లో ధైర్యాన్ని నింపిన ఆపద బాంధవుడు నిబద్ధతగల నాయకుడు పోదేం వీరయ్య కు హృదయపూర్వక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు ఆయన నాయకత్వం భవిష్యత్తులో మన అందరికీ మరింత స్ఫూర్తిదాయకం ఉండాలని కోరుకుంటున్నా కోరుకుంటున్నాం



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## ఫేక్ డిగ్రీలు.. 3 వేల మంది టీచర్ల తొలగింపు!

**మన దునియా,బీహార్:జులై 11**



బీహార్ లో నకిలీ సర్టిఫికేట్లు, ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా ఉద్యోగాలు పొందిన దాదాపు 3 వేల మంది ఉపాధ్యాయులను విధుల్లోంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 2006 నుంచి 2015 మధ్య కాలంలో జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విజిలెన్స్ బ్యూరో సుదీర్ఘ దర్యాప్తు చేపట్టింది. విజిలెన్స్ అధికారులు సమర్పించిన సమగ్ర నివేదిక ఆధారంగానే ప్రభుత్వం ఈ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోంది. కేవలం ఉద్యోగాల నుంచి తొలగించడమే కాకుండా, సదరు ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించింది. ఇప్పటికే ఈ స్కామ్తో సంబంధం ఉన్న పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.తప్పు చేసిన వారెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు.మరోవైపు, అక్రమ మార్గాల్లో ఉద్యోగాలు సంపాదించి, ఇన్నేళ్లుగా ప్రభుత్వ ఖజానా నుంచి వారు పొందిన జీతాలు, గౌరవ వేతనాలను వదిలేయకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఇంతకాలం వారు తీసుకున్న వేతన సొమ్ము మొత్తాన్ని వడ్డీతో సహా రికవరీ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం విద్యాశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

## కొడుకు మరణం.. కోడలికి మళ్లీ పెళ్లి చేసిన మామ

**మన దునియా,మధ్యప్రదేశ్:జులై 11**



మధ్యప్రదేశ్‌లో ఓ మామ తన కోడలికి మళ్లీ స్వయంగా పెళ్లి జరిపించారు. తండ్రి స్థానంలో ఉండి కన్యాదానం చేశారు. ఉజ్జయిని జిల్లా జైథల్ గ్రామానికి చెందిన దినేశ్ వైరాగి కుమారుడు కపిల్‌కు ప్రియాంకతో 2018లో వివాహమైంది. అప్పటికి ఆమె వయసు కేవలం 19 ఏళ్లు. క్యాన్సర్ కారణంగా కపిల్ 2023లో మరణించాడు. చిన్న వయసులోనే తన కోడలు ఒంటరవడం దినేశ్ వైరాగిని కలచివేసింది. అప్పటి నుంచి ప్రియాంకను సొంత కుమార్తెలా చూసుకున్నాడు. ఆమెకు మెరుగైన భవిష్యత్తు ఉండేందుకు మళ్లీ పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నాడు. మంచి సంబంధం చూసి ఇటీవల భోపాల్‌లో వైభవంగా వివాహం జరిపించాడు. స్వయంగా తానే కన్యాదానం చేశాడు. పెళ్లి ఖర్చులను భరించాడు. కోడలి పట్ల దినేశ్ వైరాగి మమకారాన్ని అంతా ప్రశంసిస్తున్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం స్వాధీనం ఒకరిపై కేసు నమోదు



**మన దునియా,భూపాలపల్లి జిల్లా:జులై 11**




భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ గారి ఆధ్వర్యంలో సిసిఎస్ పోలీసు బృందం చేపట్టిన ప్రత్యేక తనిఖీలలో మొగుళ్లపల్లి మండలం అకినపల్లి గ్రామానికి చెందిన గౌరీశెట్టి కృష్ణమూర్తి తండ్రి: వెంకటరాజం అనే వ్యక్తి, కిరాణా దుకాణం నిర్వహిస్తూ అక్రమంగా సుమారు 6 నుండి 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించారు.సీసీఎస్ బృందం దాడి నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నిందితుడిని, స్వాధీనం చేసిన బియ్యంతో పాటు మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలకు విజ్ఞప్తి: ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరం. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నాము.

# నగరం లో తెల్ల వారుతున్న వేళ... బంగారు గొలుసు దొంగల హల్చల్





- **రెండు ప్రాంతాల్లో రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు ల చోరీ కారులో వచ్చి దర్జాగా బంగారు గొలుసు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

నిజామాబాద్ నగరంలో తెల్లవారుతుండగానే చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు.. శనివారం ఉదయం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మాక్లూర్ మండలం లో ఓ మహిళను అడ్రస్ అడిగినట్లు అడిగి రెండు తులాల బంగారు గొలుసు తెంపుకొని పరారీ అయ్యారు. తర్వాత అక్కడి నుంచి నగరంలో మూడవ టౌన్ పరిధిలోని దుబ్బ ప్రాంతంలో తెల్లవారుజామున ఆరుబయట వాకిలి ఊడ్చే మహిళ మెడలో బంగారు గొలుసు తో పాటు చెవి కమ్మలు లాక్కుని పరారీ అయ్యారు. మహిళ లబోదిబో మంటు దొంగలు దొంగలు అంటు అరిచే సరికి వారు పరారి అయ్యారు.నలుగురు సభ్యులు కలిగిన ముఠా కారులో వచ్చి సిని పక్కిలో బంగారు గొలుసులు చోరికి పాల్పడటం కలకలం రేపింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు చైన్ స్నాచింగ్ లు అన్ని బైక్ ల మీద వచ్చి చోరి చేసిన దాఖలు ఉన్నాయి. అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలు కూడా బైక్ లపై చోరీలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. కాని తొలిసారి కార్ లో వచ్చిన దొంగలు గొలుసులతో పాటు కమ్మలు లాక్కుని వెళ్లడం కలకలం రేపింది. ఈ రెండు ఘటన నేపథ్యంలో దుండగులు వచ్చిన కారు వివరాలు గుర్తించేందుకు కమిషనరేట్ పరిధిలో నాకా బంది నిర్వహించారు. అంతర్ రాష్ట్ర దొంగల ముఠా పని కావచ్చని, కారు కూడా దొంగిలించినది లేదా నెంబర్ ప్లేట్లను మార్చి చోరీకి పాల్పడ్డారు అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.



శనివారం ఉదయం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య దుబ్బ బంగారు గొలుసులు, కమ్మలు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

# ఘనంగా చిల్డ్రన్స్ పార్లమెంట్ వార్షిక దినోత్సవం





**మన దునియా,ములకలపల్లి:జులై 11**

ములకలపల్లి గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి చిల్డ్రన్స్ పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పొగలపల్లి,తిమ్మంపేట, చోటిగూడెం కంపగూడెం ములకలపల్లి మాదారం జగన్నాథపురం మోగరాలగుప్ప మోటుగూడెం గొల్లగూడెం గ్రామాలకు చెందినటువంటి చిల్డ్రన్స్ పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.బాలసభ మంత్రులు మాట్లాడుతూ.క్షేత్రస్థాయిలో సమస్యలను తాము గుర్తించి వాటి పరిష్కారం కోసం గ్రామ సభలలో పాల్గొని వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి తమ మద్దతును అందించినటువంటి సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి,ములకలపల్లి సర్పంచ్ కోర్సా చంద్రలేఖ,పొగలపల్లి సర్పంచ్ మడకం రవి,మాదారం సర్పంచ్ సుజాత లు పాల్గొని మాట్లాడుతూ.చిన్నతనం నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం గ్రామాల్లోని నెలకొని ఉన్న సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారాల కోసం ప్రయత్నించడం అభినందనీయమన్నారు.ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.అదేవిధంగా పాఠశాలలో నిర్వహించేటువంటి పేరెంట్ మీటింగ్ టీచర్ తల్లిదండ్రులను కూడా తీసుకొని వచ్చేలా చూడాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ,తిమ్మంపేట హెచ్ఎం శంకర్,సిస్టర్స్ ఉదయ రీమా తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం



# ఇంగ్లండ్‌తో చివరి టీ20... టీమిండియా బస్సు ట్రాఫిక్ లో చిక్కుకోవడంతో టాస్ ఆలస్యం

**ఇంగ్లండ్‌తో చివరి టీ20కి ట్రాఫిక్ అంతరాయం**

**ఆలస్యంగా మైదానానికి చేరుకున్న భారత జట్టు**

**టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**

**ఈ మ్యాచ్ గెలిస్తే నెం.1 ర్యాంక్ దక్కించుకోనున్న ఇంగ్లండ్**

**భారత జట్టులోకి సంజూ శాంసన్, సూర్యాన్ష్ షెడ్గే**

**తుది జట్టులో వైభవ్ సూర్యవంశీకి దక్కని చోటు**



ఇంగ్లండ్, భారత్ మధ్య జరగాల్సిన ఐదో, చివరి టీ20 మ్యాచ్‌కు అనుకోని అవాంతరం ఎదురైంది. భారత జట్టు ప్రయాణిస్తున్న బస్సు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో, మ్యాచ్ టాస్ ఆలస్యంగా వేశారు. షెడ్యూల్ ప్రకారం మైదానానికి చేరుకోవడంలో జాప్యం జరగడంతో, టాస్‌ను సుమారు అరగంట పాటు వాయిదా వేశారు. చివరకు, టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ మైదానం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతోంది. ఇప్పటికే సిరీస్‌లో పటిష్టమైన ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్, ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 4-0తో క్లీన్‌స్వీప్ చేయాలని చూస్తోంది. అంతేకాకుండా, ఈ విజయం సాధిస్తే టీమిండియాను వెనక్కి నెట్టి టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంటుంది. ఈ మ్యాచ్ గెలిచి నంబర్ వన్ ర్యాంక్ సాధించడం తమ లక్ష్యమని ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మ్యాచ్‌కు ముందు చెప్పాడు. టాస్ సందర్భంగా శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "పిచ్‌లో పెద్దగా మార్పు ఉండదని భావించి బౌలింగ్ ఎంచుకున్నాం. ఈ సిరీస్‌లో ఎదురైన సవాళ్లకు మేం సిద్ధంగా ఉన్నాం" అని అన్నాడు. ఈ మ్యాచ్ కోసం భారత జట్టు రెండు మార్పులు చేసింది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో సూర్యాన్ష్ షెడ్గే, సూర్యవంశీ స్థానంలో సంజూ శాంసన్ తుది జట్టులోకి వచ్చారు. ట్రాఫిక్ కారణంగా కాస్త ఆలస్యమైనప్పటికీ, ఇరు జట్లు ఈ కీలక పోరుకు సిద్ధమయ్యాయి.

రెండు జట్ల వివరాలు:

భారత్ (తుది జట్టు): అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ. ఇంగ్లండ్ (తుది జట్టు): ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, శామ్ కరన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

# లార్డ్స్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ చారిత్రక రికార్డ్.. తొలి భారత క్రికెటర్‌గా అరుదైన ఘనత!

**లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ కౌర్**

**టెస్టు, వన్డే, టీ20లలో హాఫ్ సెంచరీ చేసిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డ్**

**ఇంగ్లండ్‌తో తొలి మహిళల టెస్టులో 58 పరుగులు చేసిన కెప్టెన్**

'క్రికెట్ మక్కా'గా పేరుగాంచిన చారిత్రక లార్డ్స్ మైదానంలో భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. క్రికెట్‌లోని మూడు ఫార్మాట్లు అయిన టెస్టు, వన్డే, టీ20లలో ఈ మైదానంలో అర్ధశతకం సాధించిన తొలి భారత క్రికెటర్‌గా (పురుషులు, మహిళలతో సహా) ఆమె చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా కూడా నిలిచింది. ఇంగ్లండ్‌తో నిన్న ప్రారంభమైన తొలి మహిళల టెస్టు మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ ఈ అసాధారణ ఫీట్‌ను అందుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు ఆరంభంలో తడబడింది. 37 పరుగులకే యువ ఓపెనర్ షఫాలీ వర్మ, యాస్తికా భాటియా వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో సీనియర్ ఓపెనర్ స్మృతి మంధాన (83), జెమీమా రోడ్రిగ్స్ (35) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధానతో కలిసి భారత స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 89 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఎంతో నిలకడగా ఆడిన హర్మన్‌ప్రీత్, 121 బంతుల్లో 58 పరుగులు చేసి తన చారిత్రక హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుంది. అయితే, టీ విరామానికి ముందు అరంగేట్ర బౌలర్ మ్యాడీ విలియర్స్ బౌలింగ్‌లో ఆమె క్లీన్ బౌల్డ్ అయింది. ఇప్పటికే లార్డ్స్‌లో వన్డే, టీ20లలో అర్ధశతకాలు చేసిన 37 ఏళ్ల కౌర్, తన తొలి టెస్టు ఇన్నింగ్స్‌లోనే ఈ ఘనత సాధించడం విశేషం. స్మృతి, హర్మన్‌ప్రీత్ ఔటైన తర్వాత, లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ (57) అద్భుతంగా రాణించడంతో భారత జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగుల గౌరవప్రదమైన స్కోరు వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్, తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత్ కంటే 264 పరుగులు వెనుకబడి ఉంది. లార్డ్స్ మైదానంలో మహిళల టెస్టు జరగడం ఇదే ప్రప్రథమం కాగా, ఈ చారిత్రక మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ అరుదైన రికార్డు నెలకొల్పడం భారత క్రికెట్ అభిమానులకు గర్వకారణంగా నిలిచింది.




# లార్డ్స్ టెస్టులో పట్టుబిగించిన భారత అమ్మాయిలు... సొంతగడ్డపై ఇంగ్లండ్ విలవిల




లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత మహిళల జట్టు పట్టు బిగించింది. రెండో రోజు టీ విరామానికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసిన టీమిండియా, మొత్తం ఆధిక్యాన్ని 145 పరుగులకు పెంచుకుంది. అంతకుముందు, యువ పేసర్ క్రాంతి గౌడ్ (5/37) అద్భుత ప్రదర్శనతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్‌కు 115 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. లంచ్ విరామం తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను ముగించిన భారత్, రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను ప్రారంభించింది. ఇంగ్లండ్ పేసర్లు లారెన్ బెల్, లారెన్ ఫైలర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మలను పరీక్షించారు. అయితే, ఇద్దరూ సంయమనంతో ఆడి కొత్త బంతి ముప్పును సమర్థంగా ఎదుర్కొన్నారు. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన స్మృతి మంధాన, ఆ తర్వాత ఫైలర్ బౌలింగ్‌లో రెండు అద్భుతమైన పుల్ షాట్లతో బౌండరీలు బాది ఒత్తిడిని తగ్గించింది. మరోవైపు, షఫాలీ వర్మ కూడా కుదురుకున్నాక దూకుడు పెంచింది. ముఖ్యంగా స్పిన్నర్ సోఫీ ఎక్సెల్‌స్టోన్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టి తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. ఈ ఓవర్లో మొత్తం 13 పరుగులు రావడంతో భారత్ స్కోరు వేగంగా కదిలింది. టీ విరామ సమయానికి స్మృతి (10ని), షఫాలీ (14ని) క్రీజులో ఉన్నారు. ఇద్దరు ఓపెనర్లు క్రీజులో పాతుకుపోవడంతో, ఈ మ్యాచ్‌లో భారత్ పటిష్ట స్థితికి చేరుకుంది. భారీ ఆధిక్యం సాధించి ఇంగ్లండ్‌ను మ్యాచ్ నుంచి పూర్తిగా దూరం చేయాలని టీమిండియా భావిస్తోంది.

సంక్షిప్త స్కోర్లు:

భారత్: 285 & 30/0 (స్మృతి మంధాన 10ని, షఫాలీ వర్మ 14ని)

ఇంగ్లండ్: 170 ఆలౌట్ (అమీ జోన్స్ 52; క్రాంతి గౌడ్ 5/37, సయాలీ సత్ఘరే 2/40)

# బట్లర్ మెరుపు సెంచరీ, బ్రూక్ విధ్వంసం... టీమిండియా ముందు 258 పరుగుల భారీ టార్గెట్

ధారాళంగా పరుగులు సమర్పించుకున్న భారత బౌలర్లు

సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ మైదానంలో జరుగుతున్న చివరిదైన ఐదో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. భారత బౌలర్లను చితకబాదుతూ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓపెనర్ జోస్ బట్లర్ (131) అద్భుత శతకంతో చెలరేగగా, కెప్టెన్ హ్యారీ బ్రూక్ (95ని) మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. దీంతో ఈ మ్యాచ్ గెలవాలంటే టీమిండియా అద్భుతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు టాస్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఈ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (6) ఔటైనా, ఆ తర్వాత బట్లర్, బ్రూక్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించారు. ముఖ్యంగా బట్లర్ కేవలం 64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 131 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. బ్రూక్ 45 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 95 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 233 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తొలుత బ్రూక్ వేగంగా ఆడగా, హాఫ్ సెంచరీ తర్వాత బట్లర్ విశ్వరూపం ప్రదర్శించాడు. మైదానం నలువైపులా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. దాంతో భారత బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. భారీగా పరుగులు సమర్పించుకోవడంతో పాటు, 15 వైడ్లు వేసి క్రమశిక్షణారాహిత్యాన్ని ప్రదర్శించారు. దీనికి తోడు, పేలవమైన ఫీల్డింగ్ కూడా ఇంగ్లండ్ భారీ స్కోరుకు కారణమైంది. కీలక సమయాల్లో క్యాచ్‌లు జారవిడవడంతో బట్లర్, బ్రూక్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి భారీ స్కోరు అందించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మినహా అందరూ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 63 పరుగులు, ప్రిన్స్ యాదవ్ 60 పరుగులు ఇచ్చారు. శివమ్ దూబే ఒకే ఓవర్లో 22 పరుగులు ఇచ్చినా.. బట్లర్, బెథెల్ వికెట్లను పడగొట్టాడు. ప్రసిద్ధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కింది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# గాన కోకిల ఎస్. జానకమ్మ కన్నుమూత




మన దునియా,మైసూర్:జులై 11

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసింది. తన మధురమైన గాత్రంతో కొన్ని దశాబ్దాల పాటు కోట్ల మంది ప్రేక్షకులను మైమరపించిన లెజెండరీ సింగర్, గానకోకిల ఎస్. జానకి(88) ఇకలేరు. కొద్దిసేపటి క్రితమే మైసూర్ లో ఆమె మరణించారు. ఈ విషయాన్ని జానకి మనవరాలు అప్సర వైద్యుల సోషల్ మీడియా వేదికగా తెలిపారు. దీంతో ఇండస్ట్రీలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.'నా ప్రియమైన అమ్మమ్మ, లెజెండరీ సింగర్ శ్రీమతి ఎస్. జానకి గారు కన్నుమూశారని తీవ్ర విచారంతో పంచుకుంటున్నాను. కుటుంబ సభ్యుల ప్రేమ మధ్య ఆమె ప్రశాంతంగా చివరి శ్వాస విడిచారు. ప్రస్తుతం మా హృదయాలు భారంగా ఉన్నప్పటికీ.. ఆమె జీవించిన అసాధారణమైన జీవితానికి, తన అమర సంగీతం ద్వారా కోట్ల మందికి అందించిన అపరిమితమైన ఆనందానికి మేము ఎంతో కృతజ్ఞతతో ఉన్నాము. ప్రపంచానికి ఆమె ఎన్నో జ్ఞాపకాలలో భాగమైన ఒక ఐకానిక్ వాయిస్ కావచ్చు, కానీ మాకు మాత్రం ఎంతో ఆప్యాయత, వినయం, దయ, హుందాతనం కలిగిన ఒక ప్రియమైన అమ్మమ్మ. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ మాతోనే ఉంటాయి. మేము ఈ పెద్ద లోటును తట్టుకుని, తీవ్ర బాధలో ఉన్న ఈ కష్టసమయంలో మా కుటుంబానికి కావలసిన ప్రైవసీని గౌరవించాలని అందరినీ కోరుతున్నాను. మమ్మల్ని అర్థం చేసుకున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అంటూ తెలిపారు. ఇక ఈ వార్త విన్న సినీ పరిశ్రమ, సంగీత అభిమానులు ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. జానకి మరణంతో టాలీవుడ్‌తో పాటు మొత్తం దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ నెటిజన్లు, సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు..

## గాన కోకిల ఎస్. జానకి కన్నుమూత... చిరంజీవి తీవ్ర విచారం

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న లెజెండరీ గాయని, 'గాన కోకిల' ఎస్. జానకి (88) కన్నుమూశారు. కొంతకాలంగా వయసు సంబంధిత అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్న ఆమె, శనివారం మైసూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జానకమ్మ మృతి వార్తతో యావత్ సినీ పరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది. ఆమె మరణం పట్ల మెగాస్టార్ చిరంజీవి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన నివాళు లర్పించారు. "తెరపై మేము పండించిన ఎన్నో భావోద్వేగాలకు ఆమె గొంతు ప్రాణం పోసింది. ఆమె ఒక అసాధారణ కళాకారిణి" అని పేర్కొన్నారు. తన సినీ ప్రయాణంలో ఎన్నో మరపురాని గీతాలకు ఆమె తన అపురూపమైన గాత్రాన్ని అందించారని చిరంజీవి గుర్తుచేసుకున్నారు. తన కెరీర్‌లో ప్రేక్షకులు ఆదరించిన ఎన్నో మధురమైన పాటల వెనుక జానకమ్మ గారి గాత్రం ఉందని కొనియాడారు. ఆ పాటలు వినిపించిన ప్రతిసారీ, ఆ జ్ఞాపకాలు మళ్లీ కళ్లముందు సజీవంగా నిలుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."జానకమ్మ గారు కేవలం ఒక గాయని మాత్రమే కాదు, భావాన్ని స్వరంగా మార్చిన అసాధారణ కళాకారిణి, ఆమె పాడిన ప్రతి పాట ఒక జ్ఞాపకం... ఒక అనుభూతి... ఒక జీవితకాలపు అనుబంధం. నేడు మనం సంగీత ప్రపంచంలోని ఒక మహోన్నత శిఖరాన్ని కోల్పోయాం. కానీ ఆమె గానం రాబోయే ఎన్నో తరాలకు స్ఫూర్తిగా, మన జీవితాలకు నేపథ్య సంగీతంగా చిరకాలం మార్మోగుతూనే ఉంటుంది. ఎస్. జానకి గారి కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు మరియు ఆమెను ఆరాధించే కోట్లాది మంది సంగీతాభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. "జానకమ్మ గారు... మీ స్వరం ఎప్పటికీ అమరం. ఓం శాంతి" అంటూ ఆయన తన నివాళిని ముగించారు.



# షూటింగ్ లో గాయపడ్డ రాశి ఖన్నా

**అక్షయ్ కుమార్ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్న రాశి ఖన్నా**

**యాక్షన్ సీన్ చిత్రీకరిస్తున్న సమయంలో గాయపడ్డ రాశి**

**ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించిన ముద్దుగుమ్మ**

బిజీ కథానాయిక రాశి ఖన్నా షూటింగ్ సెట్‌లో గాయపడ్డారు. ప్రస్తుతం టాలీవుడ్ కంటే తమిళ్, హిందీ ప్రాజెక్టులపైనే ఎక్కువగా ఫోకస్ పెట్టిన ఈ బ్యూటీ.. బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో అనీస్ బజ్మీ తెరకెక్కిస్తున్న ఓ భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో రాశి ఖన్నాకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.యాక్షన్ సీన్స్ చేస్తున్నప్పుడు దెబ్బలు తగిలినప్పటికీ, రాశి ఖన్నా ఎక్కడా బ్రేక్ తీసుకోలేదు. తన వల్ల షూటింగ్‌కు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో గాయంతోనే ఆ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఒక ఫీమేల్ యాక్టర్రై ఉండి కూడా డూప్ లేకుండా క్లిష్టమైన స్టంట్స్ చేయడం, గాయపడినా వెనకడుగు వేయకపోవడంతో ఆమె అంకితభావాన్ని చూసి నెటిజన్లు, అభిమానులు సెల్యూట్ చేస్తున్నారు.ఇక తెలుగు సినిమాల విషయానికి వస్తే.. రాశి ఖన్నా ఇటీవల నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయింది. కమర్షియల్‌గా ఈ సినిమా నిరాశపరచడంతో పాటు, ఇందులో ఆమె పోషించిన క్యారెక్టర్‌కు కూడా పెద్దగా స్కోప్ లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ బాలీవుడ్ ప్రాజెక్టులపైనే ఉన్నాయి.



## నా చివరి సినిమా కూడా ఇక్కడే.. 'లెనిన్' సక్సెస్ మీట్‌లో ఏడ్చేసిన భాగ్యశ్రీ బోర్సే..



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ఇవాళ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అభిమానులకు, చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్నారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది అభిమానుల ప్రోత్సాహమేనని ఆమె ఉద్వేగంగా అన్నారు.ఈ సందర్భంగా భాగ్యశ్రీ మాట్లాడుతూ.. "ఈ రోజు నేను చాలా ఎమోషనల్‌గా ఉన్నాను. అందుకే నా మనసులో ఉన్నది మాట్లాడాలనుకుంటున్నాను. నేను ఈ రోజు ఇక్కడ ఉండటానికి కారణమైన వ్యక్తి, మా దర్శకుడు మురళి కిశోర్ గారికి ముందుగా ధన్యవాదాలు చెప్పాలి. మీరు నాకు 'భారతి' పాత్ర ఇవ్వకపోయి ఉంటే, ఈ రోజు నాకు ఇంతటి ప్రశంసలు దక్కేవి కావు. నా మీద నమ్మకం ఉంచి, నన్ను భారతిగా తెరపై నిలబెట్టినందుకు మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని దర్శకుడికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం హీరో అఖిల్ గురించి మాట్లాడుతూ.. "అఖిల్ నువ్వు ఎంత కష్టపడ్డావో పక్కనుండి నేను చూశాను. గత పదేళ్లుగా నీ ప్రయాణం నాకు తెలియకపోయినా, అనుకున్న ఫలితాలు రానప్పుడు ఎలా ఉంటుందో నేను ఊహించగలను. రక్తం, చెమట, కన్నీళ్లు చిందించి పనిచేశావు. సెట్‌లో ఒక్క క్షణం కూడా ఖాళీగా కూర్చోవడం నేను చూడలేదు. ప్రతిదీ సరిగ్గా జరగాలని తపించేవాడివి. నువ్వు ఇంతటి ప్రేమకు, విజయానికి అర్హుడివి. పదో తేదీన నీకు విజయం వస్తుందని చెప్పాను, అది వచ్చింది. అఖిల్, నువ్వు వచ్చేశావ్. నీతో కలిసి మళ్లీ నటించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. నువ్వొక అద్భుతమైన పెర్ఫార్మర్" అంటూ ప్రశంసించారు.చివరగా తన అభిమానుల గురించి మాట్లాడుతూ భాగ్యశ్రీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కన్నీళ్లను ఆపుకోలేకపోయారు. "గత ఏడాదిన్నరగా నా ప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. నేను కిందపడిపోయిన ప్రతిసారీ, నా అభిమానులు పంపిన మెసేజ్‌లు, రీల్స్, వారు చూపిన నిరంతర ప్రోత్సాహమే నన్ను ఈ రోజు ఇక్కడ నిలబెట్టింది" అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.కొద్దిసేపటి తర్వాత తేరుకుని.. "నేనొకటే చెప్పాలనుకుంటున్నాను. హైదరాబాద్ నా కర్మభూమి. నా చివరి సినిమా కూడా ఇక్కడే చేయాలని కోరుకుంటున్నాను. అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని తన ప్రసంగాన్ని ముగించారు.మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే 'భారతి' అనే పాత్రలో నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి స్పందనతో దూసుకుపోతోంది. ఈ సినిమాకు నవీన్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించగా, తమన్ సంగీతం సమకూర్చారు. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com